సాక్షి ఖమ్మం

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



కొత్త ఆశలతో...


క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. షడ్రుచుల పచ్చడితో పాటు పిండివంటల తయారీ కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు.

8లో

గరిష్ఠం / కనిష్ఠం
37° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం ఎండ ప్రభావం కాస్త తక్కువగా ఉంటుంది. మధ్యాహ్నానికి మాత్రం ఉష్ణోగ్రత పెరుగుతుంది.



న్యూస్‌రీల్

డిప్యూటీ సీఎం ఉగాది శుభాకాంక్షలు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం మయూరిసెంటర్: శ్రీ క్రోధి నామ సంవత్సరాది ఉగాది సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది అందరికీ శుభాలు కలగాలని, కష్టాలు తొలగిపోయి ఆనందమయ జీవితాలకు నాంది పలకాలని ఆకాంక్షించారు. ఇందిరమ్మ రాజ్యంలో తమ ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీలతో ప్రజల జీవితాల్లో ఆనందాలు నిండాలని ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం మేయర్ నీరజ సైతం వేర్వేరు ప్రకటనల్లో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

భూసేకరణపై రైతుల అభ్యంతరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డీసీ రాజేశ్వరి

ఏన్కూరు: సీతారామ ప్రాజెక్టులో భాగంగా లింక్ కెనాల్ నిర్మాణానికి భూసేకరణపై రైతులు అభ్యంతరం తెలిపారు. ఈ మేరకు అభ్యంతరాల స్వీకరణకు సోమవారం ఏన్కూరు తహసీల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు ముక్తకంఠంతో భూసేకరణను వ్యతిరేకిస్తూ, ప్రాజెక్టుకు భూమి ఇచ్చే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. రోడ్డు ప్రక్కన, గ్రామ సమీపం నుండి కాల్వ వెళ్తుండడంతో తాము విలువైన భూమి కోల్పోతామని గిరిజన రైతులు తెలిపారు. పాత సర్వే ప్రకారం రాజలింగాల సమీపాన కెనాల్ నిర్మించాలని వారు కోరారు. ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, సీఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ అర్జున్‌రెడ్డి, డీఈ చంద్రశేఖర్, తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణకు నేడు కౌన్సెలింగ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో మూడు నెలల ప్రత్యేక ఫౌండేషన్ కోర్స్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆసక్తి కలిగిన ఎస్సీ అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వంద మందికి శిక్షణ ఇవ్వనుండగా, అభ్యర్థుల ఎంపికకు ఖమ్మం టీఎన్జీవోస్ కాలనీలోని స్టడీ సర్కిల్‌లో మంగళవారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ధృవపత్రాలతో నేరుగా హాజరుకావాలని, వివరాలకు 98484 94290 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'ఉపాధి' కూలీలకు తాగునీరు

నేలకొండపల్లి: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఉపాధి హామీ పథకం కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. ఈనేపథ్యాన కూలీల రక్షణ కోసం ఏర్పాట్లు చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఆదేశించారు. ఉదయం 6నుంచి 11గంటల వరకే పనిచేసేలా చూడడంతో పాటు కూలీలకు రోజూ రెండు లీటర్ల తాగునీరు సమకూర్చే బాధ్యతను గ్రామపంచాయతీలకు అప్పగించారు. గతంలో కూలీలకు తాగునీటి డబ్బు చెల్లించేవారు. ఇప్పుడు మాత్రం గ్రామ పంచాయతీలు తాగునీరు సమకూర్చనుండగా, ఇందుకోసం కార్యదర్శులకు రూ.2.50 చొప్పున చెల్లిస్తారు. అయితే, పాలకవర్గాలు లేకపోవడంతో ఇప్పటికే భారం మోస్తున్న తమకు ఈ బాధ్యత అప్పగించడంపై కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వట్టిపోయాయి..



ఇది నేలకొండపల్లిలోని కట్టలమ్మ చెరువు. ఈ చెరువుకు సాగర్ నీరే ఆధారం. వానాకాలంలో నిండుగా ఉన్నా.. ఆతర్వాత సాగర్ నుంచి యాసంగిలో ఆయకట్టుకు నీరు విడుదల చేయకపోవడంతో పూర్తిగా ఎండింది. పంట వేసినా చివరకు నీళ్లు అందవనే భయంతోనే రైతులు ఆయకట్టులోని 300 ఎకరాలు బీడుగా వదిలేశారు. గత వేసవిలో ఈ సమయానికి చెరువులో నీళ్లు ఉన్నప్పటికీ.. ఈ సారి నీళ్లు లేక నెర్రెలు వారింది.

తీవ్ర వర్షాభావ పరిస్థితులతో జిల్లాలోని నీటి ఆవాసాలు వట్టిపోతున్నాయి. దీనికి తోడు మండుతున్న ఎండలతో రిజర్వాయర్లు, చెరువుల్లోనూ నీటి మట్టం రోజురోజుకూ తగ్గుతోంది. 849 చెరువుల్లో 25 శాతం లోపే నీళ్లు ఉండగా.. చాలా చెరువులు ఎండిపోయాయి. నీటి నిల్వలు అడుగంటుతుండగా మధ్య, చిన్న తరహా ప్రాజెక్టులు సైతం కళ తప్పాయి. నీటి ఆవాసాల్లో నీళ్లు లేక బోర్లు, బావుల్లోనూ నీరు అడుగంటుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ యాసంగి జిల్లా అంతటా గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

జిల్లాలో అడుగంటిన రిజర్వాయర్లు, చెరువులు

- 849 చెరువుల్లో 25 శాతం లోపే నీటి నిల్వలు
- కళ కోల్పోయిన మధ్య, చిన్నతరహా ప్రాజెక్టులు
- వర్షాభావ పరిస్థితులతో అంతటా ఇదే పరిస్థితి
- గత ఏడాదితో పోలిస్తే ఈసారి గడ్డు కాలం

నెర్రెలు వారిన చెరువులు

జిల్లాలో 984 చెరువులు ఉండగా.. వీటి పరిధిలో 1.50 లక్షల పైచిలుకు ఆయకట్టు ఉంది. వానాకాలం సరిపడా వర్షాలు లేక చాలా చెరువులు పూర్తిగా నిండలేదు. వానాకాలం సాగు బాగానే ఉన్నా.. యాసంగిలో మాత్రం సాగు తగ్గింది. దీంతో రైతులు 20వేల ఎకరాల్లోనే సాగు చేశారు. ఈ చెరువుల కిందే తాగునీటి పథకాలు కూడా ఉన్నాయి. కాగా, మొత్తం చెరువుల్లో కేవలం 11 చెరువుల్లోనే 75 శాతం లోపు, మూడు చెరువుల్లో 75 నుంచి 100 శాతం లోపు నీటి మట్టం ఉంది. ఇక జిల్లాలోని మిగతా చెరువులన్నీ నెర్రెలు వారాయి. ఈ కారణంగా గ్రామాల్లో తాగునీటి బోర్లు, బావులు కూడా ఎండిపోతున్నాయి.

కొన్నింటిలో ఆశాజనకం

పాలేరు, వైరా రిజర్వాయర్లలోని నీటిని తాగు అవసరాలకు వాడుతున్నారు. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో తాగునీటి అవసరాల దృష్ట్యా ప్రభుత్వం నాగార్జునసాగర్ నుంచి ప్రత్యేకంగా పాలేరుకు నీరు విడుదల చేయడంతో 5.5 అడుగులు ఉన్న నీటి మట్టం 18.45 అడుగులకు చేరింది. సాగర్ నుంచి నీటి విడుదలను శనివారం నిలిపేసినా ప్రధాన కాల్వలో ఉన్న నీరు ఇంకా చేరుతోంది. తద్వారా 19 అడుగులకు చేరుతుందని భావిస్తున్నారు. దీంతో వేసవి ముగిసే వరకు మూడు జిల్లాల్లో తాగునీటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. వైరా రిజర్వాయర్ నీటి సామర్థ్యం 18.03 అడుగులు కాగా 9.6 అడుగులకు పడిపోయింది. ఈ రెండు రిజర్వాయర్లలో సరిపడా నీటి నిల్వలు ఉండడంతో వేసవిలో తాగునీటికి ఢోకా ఉండదని చెబుతున్నారు.

కట్టలేరు ఎండింది..

జిల్లాలోని మధ్య, చిన్నతరహా ప్రాజెక్టులైన లంకాసాగర్, బేతుపల్లి, జాలిముడిలో నీటి నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇక కట్టలేరు నీళ్లు లేక వెలవెలబోతోంది. గత వేసవి ప్రారంభంలో ఈ ప్రాజెక్టులు అలుగుపోశాయి. కానీ ఈ ఏడాది నాగార్జునసాగర్ నుంచి నీటి విడదల లేకపోవడం, వర్షాభావ పరిస్థితుల్లో ఇప్పుడు కళ తప్పాయి. నీటి కొరతతో ఈ ప్రాజెక్టుల కింద యాసంగిలో పంటలు సాగు చేయలేదు.

జిల్లాలోని చెరువుల్లో నీటి నిల్వలు

మొత్తం చెరువులు	984
25 శాతం లోపు నీరు ఉన్నవి	849
20 నుంచి 50 శాతం లోపు	127
50 నుంచి 75 శాతం లోపు	11
75 నుంచి 100 శాతం లోపు	3



నేలకొండపల్లి మండలం చెరువు మాదారంలోని పెద్ద చెరువు ఎండిపోయి ఇలా నెర్రెలిచ్చింది. గత 40 ఏళ్ల కాలంలో ఈ చెరువు ఎండిపోవడం ఇదే మొదటిసారి. ఈ చెరువులో చేపపిల్లలను వదలగా.. కాంట్రాక్టర్ ఒత్తిడి తీసుకురావడంతో నీటిని బయటకు వదిలారని, తాము ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. అప్పుడే స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని వాపోయారు.

రిజర్వాయర్లు, నీటి నిల్వలు (అడుగుల్లో)

రిజర్వాయర్	సామర్థ్యం	ప్రస్తుతం
పాలేరు	23	18.45
వైరా	18.03	9.06
లంకాసాగర్	16	6.04
బేతుపల్లి	16	9.09
జాలిముడి	15	13.03
కట్టలేరు	07	0

లోక్‌సభ ఎన్నికల్లోనూ అసెంబ్లీ ఫలితాలే...



కూసుమంచిలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన ప్రజాప్రతినిధులు

- బీఆర్‌ఎస్, బీజేపీకి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం
- గత ప్రభుత్వ విధానాలతోనే రాష్ట్రంలో కరువు పరిస్థితులు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వైరా: గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి కర్రు కాల్చి వాతపెట్టారు... అయినా ఆ పార్టీ అధినేత కేసీఆర్ తీరు మార్చుకోకుండా రాష్ట్రంలో రైతులను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అయితే, బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజలు గుణపాఠం చెబుతారని తెలిపారు. వైరాలో సోమవారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సాగునీరు ఇవ్వలేకపోతుందని ప్రధాన ప్రతిపక్ష పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు విమర్శలను ప్రజలతో పాటు రైతులు గమనించాలని కోరారు. ప్రస్తుత కరువు పరిస్థితులకు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వ్యవహరించిన విధానాలే కారణమని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.46 వేల కోట్లతో మిషన్ భగీరథ కార్యక్రమాన్ని చేపట్టగా... ఇప్పుడు ఆ పథకం ద్వారా రాష్ట్ర ప్రజలకు తాగునీరు ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు కూడా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగామని తెలిపారు. ఈసమావేశంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, మిట్టపల్లి నాగి, దాసరి దానియేలు, బీడీకే.రత్నం తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరంలో అందరికీ ఆనందం..

కూసుమంచి: నూతన తెలుగు సంవత్సరంలో ప్రజలంతాఆనందంగా ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, భవిష్యత్‌లోనూ అదే ఒరవడి కొనసాగిస్తామన్నారు. కాగా, పాలేరు నియోజకవర్గంలో కొత్త రైల్వే లైన్ కారణంగా తాము నష్టపోతున్నామని రైతులు చెబుతున్నందున... రైతులకు నష్టం జరగకుండా సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడానని తెలిపారు. ఈసమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ బోడ మంగీలాల్‌తో పాటు మట్టె గురవయ్య, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రామసహాయం నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచిసోమవారం ఆయన ఖమ్మం లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అధికారులతో సమీక్షించారు. నామినేషన్ సహాయక కేంద్రాల ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్లు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, ఓటర్ నమోదు, ఈవీఎంల భద్రత, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై సూచనలు చేసిన కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లలో వేగం పెంచాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా 18 – 19 ఏళ్ల వయస్సు ఓటర్లు తక్కువగా ఉంటే, నమోదుపై దృష్టి సారించాలని, నామినేషన్ పత్రాలను అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఇంకా హోం ఓటింగ్, ఈవీఎంల స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతపై సూచనలు చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ యువరాజ్, జెడ్పీ సీఈఓ వినోద్, డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా ఉపాధికల్పన అధికారి కె.శ్రీరామ్, ఉద్యోగులు అరుణ, రాంబాబు, మదన్‌గోపాల్, సత్యనారాయణ, మీనన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రావొద్దు

- రిజర్వాయర్లలో మూడు నెలలకు సరిపడా నీరు
- ఆర్‌డబ్ల్యూఎస్ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

ఖమ్మం సహకారనగర్: తాగునీటి సరఫరాలో నిర్వహణ లోపాలు ఎదురుకాకుండా జాగ్రత్త వహించాలని.. తద్వారా నీటి ఇబ్బందులు రానివ్వొద్దని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సుల్తానియా మాట్లాడుతూ చిట్ట చివరి ఆవాసం వరకు తాగునీరు అందేలా కార్యాచరణ ఉండాలని తెలిపారు. పాలేరు, వైరా రిజర్వాయర్లలో రానున్న మూడు నెలలకు సరిపడా నీరు నిల్వ ఉందని.. సక్రమంగా సరఫరా చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈమేరకు మోటార్ల నిర్వహణను పర్యవేక్షిస్తూ పైప్‌లైన్ల లీకేజీలు సరిచేయాలని సూచించారు. అలాగే, బోర్లు, చేతి పంపులను మరమ్మతు చేయించాలని తెలిపారు. ఈ మూడు నెలలు కీలకంగా భావించితాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని సుల్తానియా చెప్పారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ సాగర్ నుండి అంచనాల మేరకు నీరు అందుతున్నందున నిర్వహణలో లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

వైరా రిజర్వాయర్ పరిశీలన

వైరా/ఖమ్మం మయూరిసెంటర్: వైరా రిజర్వాయర్‌ను సందీప్‌కుమార్ సుల్తానియా పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్‌లో నీటి నిల్వలు, సరఫరాపై అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం 9.6 అడుగుల మేర నీరు ఉన్నందున 53 రోజుల పాటు మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని 11 మండలాలకు ఇబ్బంది లేకుండా తాగునీరు సరఫరా చేయొచ్చని అధికారులు తెలిపారు. ఆతర్వాత ఖమ్మంలోని మున్నేరుపై దానవాయిగూడెం వద్ద చెక్‌డ్యామ్‌ను సుల్తానియా పరిశీలించారు. చెక్‌డ్యామ్ వద్ద అవసరమైన మేర నీరు ఉన్నందున సరఫరాలో జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, మిషన్ భగీరథ ఈఎన్‌సీ జి.కృపాకర్‌రెడ్డి, మిషన్ భగీరథ, ఇరిగేషన్ సీఈలు కె.శ్రీనివాస్, విద్యాసాగర్, జెడ్పీ సీఈఓ వినోద్, డీపీఓ హరికిషన్, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వైరా రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సందీప్‌కుమార్ సుల్తానియా, పక్కన కలెక్టర్ గౌతమ్, అధికారులు

ప్రకృతిలోనే ఆత్మీయత

- అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్న మనిషి
- నానాటికీ అంతరిస్తున్న నైతిక విలువలు
- కాళోజీ అవార్డు గ్రహీత, ప్రజాకవి జయరాజు

వైరా: 'ప్రకృతిని అర్థం చేసుకోవడంలో మనిషి విఫలమవుతున్నాడు. ప్రకృతితో మనకు విడదీయరాని సంబంధం ఉంది. ప్రకృతిలో ఉండే ఆత్మీయత మరెక్కడా కానరాదు.' అని ప్రజాకవి, గాయకుడు, కాళోజీ అవార్డు గ్రహీత గొడిసల జయరాజు అన్నారు. వైరాలో సోమవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా జయరాజు వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే...

జీవాలన్నింటినీ ప్రేమిస్తేనే..

సృష్టిలోని సమస్త జీవరాశులను ప్రేమించినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుంది. నేటి సమాజంలో నైతిక విలువలకు సముచిత స్థానం దక్కడం లేదు. ప్రపంచానికి జ్ఞానం, నైతిక విలువలను భారత సమాజం అందించింది. కానీ బుద్ధుడు నడయాడిన ఈ నేలపై నైతిక విలువలు నానాటికీ కొరవడుతున్నాయి. బౌద్ధాన్ని చూసి అలెగ్జాండర్ దేశంపై యుద్ధం చేయకుండా వెనుదిరిగాడు. కళింగ యుద్ధంలో అశోకుడు తన లక్షలాది సైన్యాన్ని వదిలి చెట్లను నాటి విశ్వవిద్యాలయాలను ఏర్పాటుచేశాడు. బౌద్ధ జ్ఞానాన్ని చూసి ఎందరో నైతిక జ్ఞానం వైపు ప్రయాణించారు. బౌద్ధం యుద్ధం చేయదు... జ్ఞానాన్ని మాత్రమే బోధిస్తుంది. నేటి తరం విద్యార్థులు జ్ఞాన ప్రబోధాన్ని పొందాలంటే నలంద, తక్షశిల వంటి విశ్వవిద్యాలయాలు అవసరం.



ప్రజాకవి జయరాజు

కుళ్లిపోతున్న శరీరం

ప్రకృతిని అపారంగా ప్రేమించే మన దేశంలో చిన్న జీవరాశికి కూడా ఇబ్బంది కలిగించకపోయేవారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన ఎరువుల పేరిట నేలను చంపేస్తున్నారు. మట్టిలో ఉన్న కోట్లాది జీవరాశులను పురుగు మందులు నాశనం చేస్తున్నాయి. ఈ భూమిలో పండిన పంటలు తింటున్న మన శరీరాలు బతికి ఉండగానే కుళ్లిపోతున్నాయి. కేన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయి. ఇకనైనా సమాజం మేల్కొనకపోతే ప్రకృతి నాశనమవుతుంది.

పాటే ప్రాణం.. జీవితం

పాట అంటే నాకు ప్రాణం.. పాటే నా జీవితం. నేను ఇప్పటి వరకు 25 సినిమాల్లో పాటలు రాశా. అన్ని పాటల్లోకెల్లా నాకు అమ్మ పాటలు రాయడం ఎంతో ఇష్టం.

వేడుకలకు వేళాయె..

- భద్రగిరిలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- గవర్నర్‌కు ఆహ్వానపత్రిక అందజేసిన ఈఓ

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీరామనవమి వేడుకలకు కూడా నేడే అంకురార్పణ చేయనున్నారు. క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రసాద వితరణ అనంతరం 9 గంటలకు ఉత్సవాలు ప్రారంభించనున్నారు. రుత్విక్ వరణం, రక్షాబంధనం, స్నపన తిరుమంజనం, మత్స్యంగ్రహణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారికి కల్పవృక్ష వాహనంలో తిరువీధి సేవ జరిపిస్తారు. అనంతరం బేడా మండపంలో శ్రీ సీతారాముల వారికి అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణం గావిస్తారు. కాగా, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించగా.. భద్రగిరిలో ప్రత్యేక శోభ సంతరించుకుంది.

గవర్నర్‌కు ఆహ్వానపత్రిక..

శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆలయ ఈఓ రమాదేవి, వైదిక కమిటీ సభ్యులు సోమవారం హైదరాబాద్‌లో ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా పండితులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి జ్ఞాపిక, ప్రసాదం అందించారు. స్వామివారి కల్యాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, మరుసటి రోజు జరిగే పట్టాభిషేక మహోత్సవానికి గవర్నర్ వచ్చే సంప్రదాయాన్ని రాధాకృష్ణన్‌కు ఈఓ వివరించారు.

కల్యాణ వైదిక పెద్దలు వీరే..

నవమి రోజున శ్రీ సీతారామ కల్యాణం నిర్వహించే వారిలో వైదిక పెద్దలు ప్రముఖ పాత్ర పోషిస్తారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచి ఉత్సవాలు ముగిసే వరకు ప్రతీ క్రతువులో వీరు పాల్గొని ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగేలా శాస్త్రోక్త పాత్ర పోషిస్తారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో అధ్వర్యులుగా పొడిచేటి సీతారామానుజాచార్యులు, బ్రహ్మగా అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, ఆచార్యులుగా కోటి శ్రీమన్నారాయణాచార్యులు, రుత్విక్‌లుగా అమరవాది మురళీకృష్ణమాచార్యులు, సీతారామాచార్యులు, పరిచార రుత్వికులుగా రాఘవాచార్యులు, అలంకరాల రుత్విక్‌లుగా కోటి రామస్వరూప్, కోటి విష్ణు వ్యవహరిస్తారు.



గవర్నర్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఈఓ, అర్చకులు

గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

ఖమ్మంక్రైం: గంజాయి రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మల్టీజోన్–1 ఐజీ రంగనాథ్ సూచించారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీసులతో సమీక్షించారు. అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర సరిహద్దులు ఉన్న పోలీస్ అధికారులు సమన్వయం, సమాచార మార్పిడితో గంజాయి ముఠాలకు అడ్డుకట్ట వేయాలని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. కాగా, ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడేళ్ల క్రితం 170 కేజీల గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నలుగురికి ఇరవై ఏళ్ల జైలు శిక్ష, జరిమానా పడేలా చార్జిషీట్ దాఖలు చేసిన అధికారులను ఐజీ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి సీపీ సునీల్ దత్, అడిషనల్ డీసీపీలు ప్రసాద్‌రావు, నరేష్‌కుమార్, ఏసీపీలు రమణమూర్తి, భోజరాజు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐజీ రంగనాథ్, జిల్లా నుంచి పాల్గొన్న సీపీ సునీల్‌దత్, అధికారులు

విస్తృతంగా తనిఖీలు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామని సీపీ సునీల్‌దత్ ఓ ప్రకటనలో తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల మీదుగా గంజాయి, రేషన్ బియ్యం, ఇసుక రవాణా జరగకుండా తనిఖీలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

మార్కెటింగ్ శాఖ డీఈగా రవీందర్

ఖమ్మంవ్యవసాయం: జిల్లా మార్కెటింగ్ శాఖ డివిజనల్ ఇంజనీర్‌గా రవీందర్ నియమితుల య్యారు. ప్రస్తుత డీఈ పీఆర్ శాఖ ఉద్యోగి కె.క రుణాకర్‌రెడ్డిని మాతృశాఖలో ఏన్కూరు డీఈగా నియమించారు. దీంతో హైదరాబాద్ ఇంజనీరింగ్ విభాగంలో డీఈగా ఉన్న రవీంద ర్‌కు ఖమ్మం అదనపు బాధ్యతలు అప్పగించా రు. ఖమ్మం మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దేం దుకు సిద్ధమైన ప్రతిపాదనలను ఇతర అధికా రులతో కలిసి సోమవారం పరిశీలించారు.

సస్పెన్షన్ ఎత్తివేత

ఖమ్మం సహకారనగర్: తల్లాడ మండలం మల్సూర్‌తండా ప్రాథమిక పాఠశాల ఆవరణ లో గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించడంతో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆగ్రహం వ్యక్తం చేయగా.. ఆయన ఆదేశాలతో తల్లాడ ఎంఈఓ, మల్సూర్ తండా పాఠశాల హెచ్‌ఎంపై ఇటీవల సస్పెన్షన్ వేటు వేశారు. ఆతర్వాత విచారణ చేపట్టిన అధికారులు సోమవారం ఇన్‌చార్జ్ ఎంఈఓ ఎస్.దామోదర్‌ప్రసాద్, మల్సూర్ తండా హెచ్ ఎం అన్నపూర్ణపై సస్పెన్షన్ ఎత్తివేశారు.

మహిళా అధికారితో అనుచిత ప్రవర్తన

మధిర: గంజాయి మత్తులో ఉన్న ఓ వ్యక్తి.. మహిళా అధికారి పట్ల అనుచితంగా ప్రవర్తించ గా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధి రలోని రిక్రియేషన్ క్లబ్ వద్దకు ఆదివారం రాత్రి ఓ మహిళా అధికారి తన భర్తతో రాగా, గంజా యి మత్తులో ఉన్న యువకుడు అనుచిత వ్యా ఖ్యలు చేశాడు. దీంతో ఆమె తన భర్తతో కలిసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ, గం ధసిరిల్లోని మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సువర్ణాపురం క్రాస్ వద్ద పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

కొత్త ఆశలతో ఆరంభం!

ఉగాది అనగానే షడ్రుచులు, పంచాంగ శ్రవణం గుర్తుకొస్తాయి. చైత్రశుద్ధ పాడ్యమి రోజున సృష్టి ప్రారంభమైందని.. అందుకే తొలిరోజున ఉగాది జరుపుకుంటున్నామని పెద్దలు చెబుతారు. తెలుగు ప్రజల తొలి పండుగ అయిన ఉగాది మంగళవారం జరుపుకోనుండగా ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఏడాదిని శ్రీ క్రోధి నామ సంవత్సరంగా పిలుస్తారు.

– ఖమ్మంగాంధీచౌక్/సత్తుపల్లి టౌన్



ప్రత్యేక పూజలకు సిద్ధమైన ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లన్న ఆలయం

నేడు 'ఉగాది' పర్వదినం

- ప్రత్యేకంగా షడ్రుచుల పచ్చడి.. పంచాంగ శ్రవణం
- శ్రీ క్రోధి నామ సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు

వేడుకలకు సమాయత్తం

జిల్లా ప్రజలు సంప్రదాయ పద్ధతుల్లో శ్రీ క్రోధి నామ సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ వేడుకలు జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేశారు. ఉగాది రోజున పంచాగం వినడం ద్వారా సర్వపాప హరణం జరుగుతుందని నమ్మిక. ఈమేరకు ప్రజలు కొత్త సంవత్స రంలో ఆదాయ వ్యయాలు, రాజపూజ్యం, అవమానం వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఉగాది రోజున కొత్త పనులను ప్రారంభించటం ఆనవాయితీ. ప్రధానంగా గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. పశువులను శుభ్రంగా కడుక్కొని వాటిపై కుంకుమలు చల్లుకొని ఎడ్లబండ్లలో వ్యవసాయ భూము ల్లోకి సేంద్రియ ఎరువులను తోలడం మొద లుపెడతారు. అలాగే, ఏ పంటలకు ఈ ఏడాది అనుకూలంగా ఉంటుందనే తెలుసు కుని సాగుకు సమాయత్తమవుతారు.

ఉగాది పచ్చడి ప్రత్యేకం

ఉగాది వసంత రుతువు ఆగమనం ప్రారంభ మైన రోజు. ఈరోజు షడ్రుచులతో చేసిన పచ్చడి తింటారు. తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు రుచులు కలిగిన బెల్లం, చింతపండు, ఉప్పు, కారం, వేపపువ్వు, మా మిడి కాయలు తగిన మోతాదులో తీసుకుని పచ్చడి తయారు చేస్తారు. జీవితం అన్ని అను భవాలు ఎదురైతేనే అర్థవంతంగా ఉంటుం దనే భావం ఇందులో ఇమిడి ఉంది. ఇక ఆల యాలు, మాధ్యమాల్లో పండితులు వినిపించే పంచాంగానికి పలువురు ప్రాధాన్యత ఇస్తారు. ఆలయాలు, కళాక్షేత్రాల్లో వేదపండితులు, పంచాంగ కర్తలు నూతన సంవత్సర స్థితిగతు లను వివరించేందుకు సిద్ధమయ్యారు.



సత్తుపల్లిలో ఉగాది పచ్చడితో బాలికలు..

భవిష్యత్‌ను వివరించేదే పంచాగం



గ్రహాల ఆధారంగా ముహూర్తాలు పంచాం గంలో వివరించబడు తాయి. పంచాంగం భవిష్యవాణిని తెలుపుతుంది. దినాధిపతు లు, తారాబలం కూడా తెలుసుకోవచ్చు. వర్షాలు, పంటలు, కాలం తదితర అంశా లు, వ్యాపారాలు, ఉద్యోగాలు, వ్యాపారాలు తదితర అంశాలను పంచాంగం ద్వారా వెల్ల డవుతాయి.

– రంగావజ్ఝల దిలీప్‌శర్మ, పంచాంగ శ్రవణకర్త, బైపాస్ రోడ్, ఖమ్మం

పంచాంగ శ్రవణానికి ప్రాధాన్యం



ఉగాది వచ్చిందంటే పంచాంగ శ్రవణానికి ప్రాధాన్యం ఇస్తాం. పంటలు సాగుతోనే మేం ఆధార పడి ఉండడంతో ఈ ఏడాది వర్షాలు, ఏయే పంటలు పండే అవకాశం ఉందో తెలుసుకుంటాం. ఇందుకోసం కచ్చితంగా పంచాంగం వింటాం. అలాగే, ఉగాది పండుగ రోజే కొత్త దస్త్రాలను రాయడాన్ని ప్రారంభిస్తాం.

– నల్లమోతు లక్ష్మయ్య, వ్యాపారి, ఖమ్మం

సకల శుభదాయకం...



శ్రీక్రోధినామ సంవ త్సరం మంచి మార్పు నకు నాందిగా నిలుస్తుంది. ఈరోజు తలంటుస్నానం ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ఇష్టదై వాన్ని పూజించాలి. ఆలయాన్ని దర్శించు కుని ఉగాది పచ్చడి స్వీకరిస్తే మంచిజరుగు తుంది. అలాగే, పంచాంగం వినడం ద్వారా అరిష్టాలు తొలగి శుభదాయకంగా ఉంటుంది.

– శ్రీమాన్ రామకృష్ణమాచార్యులు, సత్తుపల్లి

ఆనందంగా జరుపుకుంటాం..



ఉగాది పండుగను కుటుంబం అంతా కలిసి ఆనందంగా జరు పుకుంటాం. ఏటా సం ప్రదాయంగా జరుపు కోవడం ఆనవాయితీ. ఏటా మాదిరిగానే నూతన వస్త్రాలు కొనుగోలు చేశాం. ఉగాది పచ్చడితో పాటు పిండివంటలు చేసుకుం టాం. ఇప్పటికే ఇంటిని ముస్తాబు చేసి రం గవల్లులతో తీర్చిదిద్ది పండుగ జరుపుకునేం దుకు సిద్ధమయ్యాం.

– చీపు శిరీష, సత్తుపల్లి

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్



రోడ్డుపై వరదలా పారుతున్న తాగునీరు

కారేపల్లి: విద్యుత్ ఉద్యోగుల నిర్లక్ష్యంతో కారేపల్లి మెయిన్ రోడ్డులో మిషన్ భగీరథ మెయిన్ పైపు లైన్ పగిలిపోయింది. దీంతో గంటల తరబడి రహదారిపై తాగునీరు వరదలా పారింది. కారేప ల్లి మెయిన్‌రోడ్డులో సోమవారం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను అమర్చే క్రమాన స్తంభం వేసేందుకు ట్రాక్టర్ డ్రిల్లర్‌తో గొయ్యి తీశారు. ఈక్రమంలోనే భగీరథ మెయిన్ పైపులైన్ ధ్వంసమైంది. అధికా రుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి ఎదురైందని స్థానికులు తెలిపారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం

ఏన్కూరు: టీబీ పూర్తిగా నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా టీబీ నిర్మూలన అధికారి డాక్టర్ సుబ్బారావు తెలిపారు. ఏన్కూరు మండలం శ్రీరామ గిరిలో సోమవారం టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 నాటికి తెలంగాణను టీబీ రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు అన్నిగ్రామాల్లో టీబీ లక్షణాలు ఉన్న వారి నుం డి నమూనాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉద్యోగులు శివరాజు, వై.సురేష్ పాల్గొన్నారు.

ఎంఎన్‌సీల్లో ఉద్యోగాల పేరిట మోసం

ఖమ్మంక్రైం: మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడు తున్న వారిలో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నల్లగొండ జిల్లాకు చెందిన పారేపల్లి సాయికృష్ణ, బయ్యా రవీందర్ ప్రముఖ కంపెనీల్లో రూ.వేల జీతానికి ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురికి మెసేజ్ చేస్తుంటారు. ఈ మెసేజ్‌కు ఖమ్మంకు చెందిన ఓ వ్యక్తి స్పందించగా.. పలు దఫాల్లో రూ.35వేలు తీసుకున్నారు. ఆతర్వాత ఉద్యోగాల విషయమై వారు స్పందించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన ఖమ్మం వాసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం రవీందర్‌ను అరెస్ట్ చేసి సాయికృష్ణ కోసం గాలిస్తున్నారు.



సూపరింటెండెంట్ చాంబర్ వద్ద ధర్నాకు దిగిన కార్మికులు

పెద్దాస్పత్రిలో కార్మికుల ఆందోళన

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు సరిగ్గా అందక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం నుండి నిధులు వచ్చినా, రాకున్నా కాంట్రాక్టర్ మాత్రం కార్మికులకు వేతనాలు చెల్లించాలని నిబంధనల్లో ఉన్నా ఆయన మాత్రం నిధులు రాలేదని చెల్లిం చడం లేదు. నెలకు రూ.35లక్షలు చెల్లించాల్సి ఉం డగా.. మూడు నెలలకు కలిపి రూ.35లక్షలే వచ్చాయి. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ చాంబర్ ఎదుట సోమవారం కార్మికులు ఆందోళనకు దిగారు. కొందరు ఆగ్రహం తో అద్దాలు పగులగొట్టారు.

ధర్నాకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు విష్ణు, ఇఫ్టూ ప్రధాన కార్యదర్శి రామయ్య మద్దతు తెలప గా.. సూపరింటెండెంట్, ఆర్ఎంఓ బి.అమర్‌సింగ్ వారిని శాంతిపజేసే ప్రయత్నం చేశారు. అనం తరం నాయకులతో చర్చించిన ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు.. రెండు నెలల వేతనాన్ని ఖాతాల్లో జమ చేయ డంతో ధర్నా విరమించారు.

రెండు రేషన్ షాపులు సీజ్

తల్లాడ/ఖమ్మం సహకారనగర్: బియ్యం స్టాక్‌లో తేడా ఉండడంతో తల్లాడ మండలంలోని మిట్టపల్లిలోని రెండు రేషన్ షాపులను సివిల్ సప్లయీస్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మిట్టపల్లిలోని 5వ నంబర్ షాప్ డీలర్ వేద మహేశ్వరి సెలవు పెట్టగా, 23వ షాప్ డీలర్ బేబీరాణికి అప్పగించారు. ఆమె ఈ నెలలో రెండు షాపులను నిర్వహిస్తుండగా, ఆదివారం ఓ ఆటోలో తీసుకొచ్చిన రేషన్ బియ్యాన్ని మిట్టపల్లి రహదారిపై దించారు. దీంతో సోమవారం సత్తుపల్లి సివిల్ సప్లయీస్ డీటీ సత్య నారాయణ, ఆర్ఐ కిరణ్ విచారణ చేపట్టగా 5వ నంబర్ షాప్‌లో 13.10 క్వింటాళ్ల బియ్యం తక్కువగా, 23వ షాపులో 12.64 క్వింటాళ్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. దీంతో రెండు షాపులను సీజ్ చేసి బియ్యం పంపిణీ బాధ్య తలను రామానుజవరం, నూతనకల్ డీలర్లకు అప్పగించారు.

ఆరుగురు వేటగాళ్లపై కేసు

పెనుబల్లి: తల్లాడ అటవీ రేంజ్ పెనుబల్లి మండలం తాళ్లపెంట శివారు అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేటకు వచ్చిన పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం అర్ధరాత్రి హైదరాబాద్‌కు చెందిన పుష్పాల సుగ్రీవ్, వెంకట శ్రీకాంత్, నారాయణ, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నాగరాజు, చంద్రుగొండ మండలానికి చెందిన డేరంగుల మిథున్‌కుమార్, బొర్ర సురేష్, విజయనగరం జిల్లాకు చెందిన బొడ్డెన నారాయణరావు నాటు తుపాకీ, గొడ్డళ్లు, కత్తులతో కారులో ఈ ప్రాంతానికి వచ్చారు. దీంతో తనిఖీలు నిర్వహిస్తున్న అటవీ అధికారులు వారిని అదుపులోకి తీసుకు న్నారు. వీరి వచ్చిన కారు, ఆయుధాలను ఆదివారం సీజ్ చేయగా.. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లావణ్య ఫిర్యాదుతో వారిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరా తీసిన విజిలెన్స్ డీఎఫ్ఓ

తల్లాడ: అటవీ శాఖ హైదరాబాద్ విజిలెన్స్ డీఎఫ్ఓ ముకుంద్‌రెడ్డి సోమ వారం తల్లాడ కార్యాలయాన్ని సందర్శించారు. ఇటీవల అధికారులు వన్య ప్రాణుల వేటగాళ్లను అరెస్ట్ చేయగా ఆయన వివరాలు సేకరించారు. ఎఫ్‌డీఓ మంజుల, డీఆర్ఓ బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.